
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

మంగళవారం 26 నవంబరు 2024 | 5







ద్రాక్షారామకు తరలివచ్చిన భక్తులు

ద్రాక్షారామం..భక్తజన సంద్రం

కార్తీక సోమవారం పర్వదినాన ఆలయంలో రద్దీ

ద్రాక్షారామ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆఖరు కార్తీక సోమవారం ద్రాక్షారామ పుణ్యక్షేత్రం భక్తజన సంద్రమైంది. భీమేశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులు రాక మొదలయింది. ఉదయం 11 గంటల ప్రాంతానికి భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్లు మెయిన్ రోడ్డుపై మండాలమ్మ రావిచెట్టు వరకు కనిపించాయి. స్వామివారి దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. భక్తులు భీమేశ్వరస్వామివారిని, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక అభిషేకాలు జరిగాయి. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళా భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. సామూహిక అభిషేకాలు నిర్వహించారు. రైసు మిల్లర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం జరిగింది. పైండా వారి సత్రంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ పర్యవేక్షణలో వివిధ ఆలయాలకు చెందిన సిబ్బంది సేవలు అందించారు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కుండలేశ్వరస్వామి

కుండలేశ్వరం..కిటకిట



క్యూలో భక్తులు

కాట్రేనికోన, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం కావడంతో కుండలేశ్వర క్షేత్రం రద్దీగా మారింది. వేల సంఖ్యలో భక్తులు కుండలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వృద్ధ గౌతమినదిలో స్నానాలాచరించి గోదావరి మాతను పూజించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్లకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని రుక్మిణీసమేత వేణుగోపాలస్వామి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కనకదుర్గను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో నడింపల్లి విజయరామరాజు, జయ, ర్యాలి వెంకట్రావు, శిరీష, మంతెన శ్రీనివాసవర్మ, స్వప్న, ఇందుకూరి వెంకటగణపతిబాపిరాజు, పద్మావతి, చెరుకూరి రామచంద్రరాజు, కృతి, కనుమూరి మనోహరరాజు, మాధవి, భూపతిరాజు సుబ్బరాజు, రమ్య దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో సుమారు 15,000 మంది భోజనాలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అవినాష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈవో కె.గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. కార్యక్రమంలో త్సవటపల్లి నాగు, గోకరకొండ సత్తిబాబు, గంగుమళ్ల భాను, మీసాల నాగబాబు, మోటిపల్లి చిన్న, అక్కల నాగమందేశ్వరరావు, పీఎస్ఎస్ రాజు, మీసాల పూర్ణ, మీసాల నాగబుల్లియ్య, గంగుమళ్ల కిరణ్, మోటిపల్లి శ్రీను, నలాది సతీష్, చిక్కం ఆనంద కుమార్, అడపా శివ, అడపా వెంకటేశ్వరరావు, గంగుమళ్ల శంకర్, మీసాల బాలచంద్రరావు పాల్గొన్నారు.



పి.గన్నవరం ఓఎన్‌జీసీ రేవు వద్ద బ్రిడ్జికి సమీపంలో అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం

'తుస్'మంటున్న ఉచిత ఇసుక విధానం

- అక్రమ రవాణాను అరికట్టలేని అధికారులు
- ట్రాక్టరు ఇసుక రూ.4వేల నుంచి రూ.5వేలు పైమాటే
- అధికారులు, నేతల కుమ్మక్కుతో యథేచ్ఛగా దందా
- ట్రాక్టర్లపై రేయింబవళ్లు ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు
- నేతల జేబుల్లోకి భారీగా అక్రమ సంపాదన

ఇసుక నేతలకు రాశులు..కాసులు

(అమలాపురం -ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అధికార యంత్రాంగం నిరోధించలేకపోతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న కూటమి నేతలతో సహా ఇసుక మాఫియా ప్రతినిధులు ర్యాంపులను స్వాధీనం చేసుకుని ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో ట్రాక్టర్లపై ఇసుకను భారీగా తరలించి విక్రయిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక కావాలంటే రూ.4వేల నుంచి రూ.5వేల పైనే చెల్లించాల్సిన పరిస్థితులు లబ్ధిదారులకు ఏర్పడింది. నోటిఫైడ్ ర్యాంపులు కాకుండా నదీపరివాహక ప్రాంతాల్లో అనేక చోట్ల ఇసుకను ట్రాక్టర్లపై రేయింబవళ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.





పి.గన్నవరం మండలం మానేపల్లిలో ఇసుక రవాణా

యథేచ్ఛగా తరలింపు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయలను ఆనుకుని ఉన్న అనేక అనధికారిక ర్యాంపులను ఏర్పాటు చేసుకుని ఇసుకను రేయింబవళ్లు తరలించుకుపోతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల ప్రత్యక్ష ప్రమేయంతోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్టు అభియోగాలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన పి.గన్నవరం అక్విడెక్టు సమీపంలో ఏకంగా గోదావరి ప్రవాహానికి అడ్డుకట్టవేసి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. ఇక మానేపల్లిలో అయితే పెద్దసంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించడంలో ఆ ప్రాంత కూటమి నేతలు సిద్ధహస్తులుగా మారారు. ఎవరైనా అదేమిటని ప్రశ్నిస్తే వారిపై చేయి చేసుకునే పరిస్థితులు ఎక్కడికక్కడే ఉత్పన్నమవుతున్నాయి.

'రాజోలు'లో ఇష్టారాజ్యం

రాజోలు నియోజకవర్గంలోని పలు చోట్ల ఇసుక దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సోంపల్లి, దిండి, చించినాడతో పాటు అనేకచోట్ల వశిష్ఠ నది నుంచి ఇసుకను ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. అదేవిధంగా సముద్రపు ఇసుకను తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు.

'పి.గన్నవరం' పరిధిలో

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు ప్రస్తుతం జోరందుకున్నాయి. అయినవిల్లి మండలం కొండుకుదురులంకలో ఇసుక రవాణాను నిరోధించే సత్తా అధికార యంత్రాంగం కోల్పోయిందనే చెప్పాలి. స్థానిక నేతలు మీడియాపైనా, చివరకు అధికారులపైనా దౌర్జన్యాలు చేసే పరిస్థితులకు తెగబడుతున్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఉచిత ఇసుక విధానం అమలు కావడం లేదంటూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు సోమవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 15కు పైగా ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని, దీన్ని ప్రభుత్వ యంత్రాంగం నిరోధించకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమించాల్సి వస్తుందని ర్యాంపుల పేర్లతో సహా ఆ వినతిపత్రంలో వివరించారు.

ముమ్మిడివరం నియోజకవర్గంలో

ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన, ఐ.పోలవరం, ముమ్మిడివరం మండలాలతో పాటు పుదుచ్చేరి రాష్ట్రం యానాం పరిసర ప్రాంతాలు, యానాం నుంచి కోటిపల్లి వెళ్లే ఏటిగట్టు చెంతన ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. నిత్యం ట్రాక్టర్లు, లారీలపై ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ నిరోధించే పరిస్థితులు లేవు. ఎక్కడికక్కడే మామూళ్ల మత్తులో అధికారులను ముంచెత్తుతుండడం వల్ల ఇసుక అక్రమార్కులపై కొరడా ఝుళిపించలేకపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జేబుల్లోకి సొమ్ము

ప్రభుత్వం నోటిఫై చేసిన జిల్లాలోని పన్నెండు ర్యాంపుల్లో ఇసుక రవాణా కాంట్రాక్టర్లు బాధ్యతలు స్వీకరించకముందే అక్రమార్కులు ఆయా ర్యాంపుల నుంచి భారీగా ఇసుక నిల్వలు తరలించి బహిరంగంగా విక్రయించుకోవడం ద్వారా సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఉచిత ఇసుక ముసుగులో వందలాది ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలించి లబ్ధిదారులకు భారీ రేట్లకు విక్రయిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ విషయమై అధికారులను అడిగితే ఇసుక ఉచితం కదా తామేమీ నిరోధించలేమని చెబుతున్నారు. మరోవైపు ఇసుక అక్రమాలపై కాంగ్రెస్, వైసీపీ నేతలు క్రమంగా గళం విప్పుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారు.




అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్‌ను కోరుతున్న కాంగ్రెస్ నేతలు

ఫిర్యాదు చేస్తేనే స్పందనా?

అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

పి.గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పాలసీ కూటమి ప్రభుత్వానికి తలపోటులా తయారైంది. సంబంధిత శాఖల నుంచి ర్యాంపులపై పూర్తిస్థాయిలో అదుపు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. దీంతో అనుమతులు విషయం పక్కనపెట్టి గోదావరి నదీ తీరాలలో ఇసుక తవ్వకాలకు స్థానిక నాయకులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే పి.గన్నవరం అక్విడెక్టుకు అతి సమీపంలో వైనతేయ నదీపాయకు అడ్డుకట్ట వేయడానికి శ్రీకారం చుట్టారు. ఎక్సకవేటర్ సాయంతో గట్టు వేసేందుకు పనులు ప్రారంభించడంతో అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొంత మంది నాయకులు చేసిన ప్రయత్నానికి అధికారులు ఆదిలోనే అడ్డుకట్ట వేశారు. ఓన్‌జీసీ రేవులో నుంచి నదీపాయకు అడ్డుకట్ట వేసి అవతలవైపు బాట వేసుకుని ఓపెన్ ర్యాంపు ద్వారా గోదావరి మధ్యలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కనీసం అనుమతులు లేకుండా నిబంధనలు పక్కనపెట్టి అక్విడెక్టుకు అతి సమీపంలో గోదావరి నదీపాయకు అడ్డుకట్ట వేయడానికి కొంతమంది నాయకులు ప్రయత్నించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్విడెక్టు సమీపంలో ఇంత జరుగుతున్నా. ఫిర్యాదు అందితేనే అధికారులు స్పందించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే నదీపాయకు అడ్డుకట్ట వేస్తే మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లితుందని వేటకు ఇబ్బందులు తప్పవని పలువురు మత్స్యకార సంఘం నాయకులు ర్యాంపు వద్దకు చేరుకుని నిర్వహణ చేస్తున్న నాయకులు దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. కాగా మండలంలోని మానేపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నప్పటికి అధికారులు కనీసం పట్టించుకోవడంలేదు. పి.గన్నవరంతో పాటు లంకలగన్నవరం, గంటిపెదపూడి, తాటికాయలవారిపాలెం దిగువున జిల్లేడులంకలో ఇసుక తవ్వకాలకు పలువురు నాయకులు పోటీ పడుతున్నారు. ఇసుక దోపిడీ జరుగుతున్నప్పటికి ఆ ఇసుక సామాన్యుడి ఇంటికి మాత్రం చేరడంలేదు. అంతే కాకుండా నియోజకవర్గంలోని మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో అనధికార ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

ప్రతీ దరఖాస్తును పరిష్కరిస్తాం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

గ్రీవెన్స్ సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని ప్రజలకు తెలియచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మండల కార్యాలయంలో అందజేసిన ప్రతీ దరఖాస్తుపై చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో వి.మదన్మోహనరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మండల స్థాయిలోను పురపాలక సంఘ కార్యాలయాల్లోను అర్జీదారులు తమ సమస్యలను తెలియచేసి పరిష్కార మార్గాలను పొందవచ్చునని సూచించారు. అంతే కాకుండా ఆయా అర్జీలన్నీ పీజీఆర్ఎస్‌లో నమోదు అవుతాయని గుర్తించాలన్నారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా ప్రతీ వారం కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మండల స్థాయిలోను సమర్థవంతంగా పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. మండల స్థాయిలో పరిష్కారం కావాల్సిన సమస్యలపై కూడా ప్రజలు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, అందువల్ల వారికి డబ్బుతో పాటు సమయం కూడా వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

రైతులు ధాన్యం కోతలు నిలుపుదల చేయాలి

విద్యార్థులకు అపార్ ఐడీ అత్యంత కీలకం : కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఈ నెల 28, 29 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు ధాన్యం కోతలు నిలుపుదల చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. ప్రతీ విద్యార్థికి అపార్ ఐడీ నమోదు అత్యంత కీలకమన్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు ఎక్కడ చదివింది అపార్ ఐడీ ద్వారా సులభంగా తెలుస్తుందన్నారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వివిధ మండలాల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాలల్లో అపార్ నమోదు నూటికి నూరుశాతం పూర్తి చేయాలన్నారు. అపార్ ఐడీలు జనరేట్ చేసేందుకు అవసరమైన ఆధార్, జనన తేదీ, స్కూల్ సర్టిఫికెట్ల మధ్య వ్యత్యాసాలను సరిదిద్దాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 83 శాతం అపార్ పూర్తి అయిందని, మిగిలిన విద్యార్థులను కూడా నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు దశల వారీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలన్నారు. జిల్లాస్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సీనియర్ అసిస్టెంట్ స్థాయి నోడల్ అధికారిగా నియమించి అతని సెల్ నంబరు డీఆర్వోకు అందించాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో వి.మదన్మోహనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు శుభవార్త

1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 30నే పింఛన్ల పంపిణీ

అధికారుల ఏర్పాట్లు

అమలాపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారులకు కూటమి ప్రభుత్వం మరో శుభవార్తను అందించింది. డిసెంబరు 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో ముందు రోజైన నవంబరు 30 శనివారం రోజునే సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేయాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రభుత్వం మూడు నెలల వరకు పెన్షన్ పొందే అవకాశాన్ని ఇప్పటికే కల్పించిందని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తెలిపారు. పెన్షన్‌దారుడు మరణిస్తే అతని భార్యకు వితంతు పెన్షన్ కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా పాత వాసనలు

- జగన్ బొమ్మతో బర్త్ సర్టిఫికెట్



అమలాపురం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి 150 రోజులవుతుంది. జగన్ సీఎంగా దిగిపోయి ఐదు నెలలు దాటుతుంది కానీ ఇంకా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పాత వాసన పోవడం లేదు. సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి పాలన సాగిస్తున్నప్పటికీ ఇంకా జగన్ బొమ్మతోనే కొన్ని ధ్రువపత్రాలు జారీ చేస్తుండడం గమనార్హం. అలాంటి సంఘటన ఒకటి అమలాపురం టౌన్‌లోని కొంకాపల్లి సచివాలయంలో శనివారం జరిగింది. కాట్రేనికోన మండలం నడవపల్లికి చెందిన విద్యార్థిని గెల్లా మేరీ ఎవంజెల్ జనన ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకోగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంతో ఉన్న పత్రం జారీ చేశారు. దీనిపై కూటమి నాయకులు మండిపడుతున్నారు. జగన్ ఫొటోతో ఇప్పుడెలా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారని అంటున్నారు. ఇదే విషయంపై అమలాపురం మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ రాజును వివరణ కోరగా కొంకాపల్లి సచివాలయ సిబ్బందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు.



విద్యుత్ బకాయిలు రూ.103 కోట్ల పైమాటే

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ శాఖకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. కోనసీమ జిల్లాలో విద్యుత్ శాఖకు రావాల్సిన బకాయిలు కొండలా పేరుకుపోయాయి. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి విద్యుత్ సర్వీసులు 10346 వరకు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖకు రూ.103.96 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలే రూ 55.65 కోట్లు మేర ఉన్నాయి. మరోపక్క జిల్లాలో మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీలు కలిపి రూ.28.16 కోట్లమేర బకాయిలు ఉన్నాయని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు బకాయిల చెల్లించాలని ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులు ఆయా శాఖలను కోరారు. ఏమాత్రం స్పందిస్తారో చూడాలి.

లక్ష్యానికి చేరుకున్న పశుగణన

అంబాజీపేట, నవంబరు25(ఆంధ్రజ్యోతి): పశుగణన సర్వేలో భాగంగా జిల్లాలోని 22 మండలాలకు సంబంధించి 4,93,46 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 83,476 గృహాల పరిధిలో పశుగణన పూర్తి చేసి 16.9 శాతం లక్ష్యానికి చేరుకున్నామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ కర్నీడి మూర్తి అన్నారు. నందంపూడిలో సోమవారం పశు సంపద గణనలో భాగంగా సర్వేను ఆయన పరిశీలించారు. జిల్లాలో సర్వేకు 282 మంది సిబ్బందిని నియమించామన్నారు. సర్వే 2025 ఫిబ్రవరి నెలఖారు నాటికి పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లి ఇంటిలో ఉన్న ఆవులు, గేదెలు, కుక్కలు, పందులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గుర్రాల వివరాలు సేకరించామన్నారు. జిల్లాలో దేశవాళీ ఆవులను ఎక్కువగా ప్రజలు పెంచుతున్నారన్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పశుగణన వల్ల ప్రభుత్వానికి బడ్జెట్ రూపకల్పన, అవసరమైన పథకాలు, పాడి సంపదకు అవసరమైన గడ్డి, దాణా మందులు సరఫరా చేసేందుకు ఈ పశుగణన ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, పశుసంవర్ధకశాఖ సహాయకురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ చేసి కోటి కొట్టేశారు..

పెద్దాపురం గోలివారి వీధిలోని కొండలరావు అనే వ్యక్తిని ఈ ఏడాది ఆగస్టులో డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ కేటుగాళ్లు భయపెట్టారు. అతడి నుంచి బ్యాంక్ అకౌంట్, యూపీఐ ద్వారా దశలవారీగా రూ.1కోటి 16 లక్షల 24 వేల 382 దోచేశారు. ఈడీ, సీబీఐ, ఆర్‌బీఐ, పోలీస్ అధికారులమని చెప్పి అతడిని భయభ్రాంతులకు గురిచేశారు. డిజిటల్ అరెస్ట్ అంటే భయపడి అతడు వారు చెప్పిన అకౌంట్‌కు డబ్బులు జమచేశాడు. ఇంకా డబ్బులు కావాలని వేధించడంతో విషయం తెలిసిన అతడి కుమారుడు సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో సెప్టెంబరు 25న ఫిర్యాదు చేశారు.

ట్రేడింగ్ కంపెనీ పేరున రూ.28.30 లక్షలు..

కొవ్వూరుకు చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్‌మార్కెట్ వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరానికి చెందిన మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ద్వారా లావాదేవీలు చేస్తుంటాడు. ఇదిలా ఉండగా ఇన్‌స్టాగ్రామ్‌లో అతనికి ఒక లింక్ వచ్చింది. అతను ట్రేడింగ్ చేసే కంపెనీ పేరున లింక్ ఉంది. ఈ మేరకు శ్రీనివాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన యాప్‌నకు దఫదఫాలుగా రూ.28.30 లక్షలు జమచేశాడు. చివరికి అది నకిలీదని తేలడంతో లబోదిబోమన్నారు. పట్టణ పోలీసులను ఆశ్రయించగా సైబర్‌క్రైమ్‌గా కేసునమోదు చేశారు.

మిషన్ తక్కువకు వస్తుందని..భర్తకు తెలియకుండా

కొవ్వూరు పట్టణానికి చెందిన గుల్లపూడి సుప్రియ పద్మ ఫేస్‌బుక్ అకౌంట్‌లో మహిళల జాకెట్లు కుట్టే ఎంబ్రాయిడరీ కుట్టుమిషన్ తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఒక ప్రకటన చూసింది. కుట్టుమిషన్ తీసుకోవడం ద్వారా కుటుంబానికి ఆసరాగా ఉంటుందని భావించి భర్తకు తెలియకుండా ప్రకటనలో ఉన్న నెంబరుకు ఫోన్ చేసింది. అవతలి వ్యక్తి సూచించిన విధంగా రూ.3లక్షల సొమ్మును రెండు దఫాలుగా న్యూఢిల్లీకి చెందిన అకౌంట్ నెంబరుకు 2024, జూన్ 25న జమ చేసింది. సొమ్ము చెల్లించిన అనంతరం ఫోన్ స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించింది.

వైద్యుడి నుంచి లాగేశారు..

రాజమహేంద్రవరానికి చెందిన ఒక వైద్యుడు.. నిత్యం బిజీగా ఉంటాడు.. ఆయనకు ఇటీవల ఒక ఫోన్ వచ్చింది..మీకు ఢిల్లీ నుంచి ఒక పార్శిల్ వచ్చింది.. ఆ పార్శిల్‌లో కొకైన్.. హెరాయిన్ ఉన్నాయి.. మేం ఇంటెలిజెన్స్ పోలీసులం అంటూ అవతలి నుంచి ఒక వ్యక్తి లైవ్‌లోకి వచ్చాడు.. వెనుక చూస్తే పోలీస్‌స్టేషన్ సెటప్ ఉంది.. 24 గంటలు మీరు ఎక్కడికి వెళ్లకూడదు.. ఎవరితోనూ మాట్లాడకూడదు.. ఫోన్‌లు చేయకూడదు.. అలా చేస్తే లోకల్ పోలీసులు వస్తారని భయపెట్టి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు చేశారు.. అతని నుంచి పెద్ద మొత్తంలో లాగేశారు.



'హలో నేను సీబీఐ అధికారిని మీకు విదేశాల నుంచి ఓ పార్సిల్ వచ్చింది. అందులో నిషేధిత డ్రగ్స్ ఉన్నాయి. మీపై కేసు నమోదైంది..' అంటూ ఓ వ్యక్తికి వీడియోకాల్ వచ్చింది. అటువైపు చూస్తే పోలీస్ ఉన్నతాధికారిలా ఉన్నారు. వెనుక సెటప్ అంతా పోలీస్‌స్టేషన్‌లా ఉంది. తీరా చూస్తే ఎఫ్‌ఐఆర్ నమోదైంది అంటున్నారు.. ఏం చేయాలో తెలియడంలేదు. ఒక్కసారిగా మైండ్ బ్లాంక్ అయింది. 'మీపై నమోదైన ఎఫ్‌ఐఆర్ కాపీ ఇదిగో..' అంటూ అటువైపునుంచి మీకు దాన్ని వాట్సాప్ చేస్తారు. అందులో మీకు సంబంధించిన అన్ని వివరాలు పొందుపరిచి ఉంటాయి. దీంతో ఇంకా టెన్షన్.. 'ఇది దేశభద్రతకు ముప్పువాటిల్లే కేసు అని, ఈ కేసులో అరెస్టు అవడం తప్పదని, బెయిల్ రావడం కూడా అతికష్టమని బెదిరిస్తాడు.. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.. అంటాడు..' దీంతో భయాందోళనకు గురైన బాధితుడు మెల్లగా అతడి ట్రాప్‌లోకి వెళ్లి అతడు ఏం చెప్తే అది చేస్తాడు. తన యూపీఐ ఐడీ, ఓటీపీ చెప్పేవరకూ వెళ్తుంది పరిస్థితి. ఇలా డిజిటల్ అరెస్ట్ పేరుతో మీ అకౌంట్‌లో డబ్బులు మొత్తం ఖాళీ చేస్తారు.. ఇదొక ఫేక్ కాల్ అని.. అదొక ఫేక్ ఎఫ్‌ఐఆర్ అని.. ఇది సైబర్ నేరమని మీకు తెలిసేలోపు మీరు మోసపోతారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఇటీవల ఇలాంటి మోసాలు ఎక్కువయ్యాయి. మన ఉమ్మడి జిల్లాలో కరప, పి.గన్నవరం, రాజమహేంద్రవరంల్లో ఈ తరహా మోసాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో సైబర్ నేరాలపై అప్రమత్తం చేస్తూ ప్రత్యేక కథనం..

(కాకినాడ/అమలాపురం/రాజమహేంద్రవరంసిటీ/శంఖవరం/కొవ్వూరు, ఆంధ్రజ్యోతి)

- ఉమ్మడి జిల్లాను వణికిస్తోన్న సైబర్ నేరాలు
- డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో పెరిగిన బెదిరింపులు
- ఒక్క ఫోన్ 'కాల్'తో కొల్లగొట్టేస్తున్నారు
- పెద్దాపురం, కరప, పి.గన్నవరంలో ఘటనలు
- నకిలీ వాట్సాప్ డీపీలతోనూ మోసాలు
- ఫోన్ల ద్వారా వలవేసి లక్షల్లో గుంజుడు
- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను సైబర్ నేరాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇటీవల సైబర్ నేరాలు నిత్యకృత్యమైపోయాయి. పోలీసు యూనిఫాం వేసుకుని వెనుక పోలీస్‌స్టేషన్ సెటప్‌తో ఫోన్లు చేసి బెదిరిస్తూ అందిన కాడికి గుంజేస్తున్నారు. వాట్సాప్ వీడియోకాల్స్ చేస్తూ ఎదుటి వ్యక్తి ఆధార్‌కార్డు నెంబర్, ఇంటి చిరునామా, ఇతర వివరాలు పక్కాగా చెబుతూ నిజమేనని భ్రమపడేలా బెదిరించేస్తున్నారు. కొన్ని గంటల్లో ఇంటికి వచ్చి అరెస్ట్ చేస్తామంటూ బెంబేలెత్తించేస్తున్నారు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు..భారీసంఖ్యలో జిల్లాలో అనేకమందిని భయపెట్టి వేలు.. లక్షలు.. కోట్లు.. కొల్లగొట్టేస్తున్నారు. ఈ మోసగాళ్ల బారినపడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల దగ్గర నుంచి విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, ఇతర అమాయకులు మోసపోతున్నారు. నేరగాళ్ల మాటలకు భయపడి అప్పటికప్పుడు ఫోన్‌పే, గూగుల్ పేల ద్వారా డబ్బులు ముట్టజెబుతున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, కరప, పి.గన్నవరం మండలాల్లో రెండు రోజుల వ్యవధిలో ఒకే వ్యక్తి సైబర్ నేరాలకు పాల్పడి డబ్బులు గుంజడం పెరిగిపోతున్న నేరాలను కళ్లకు కడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ల ఫొటోలను వాట్సాప్ డీపీగా పెట్టి డబ్బులు అడుగుతున్న కేసులూ నమోదయ్యాయి.

రోజుకో మోసం..

ఒకప్పుడు నగరాలకే పరిమితమైన సైబర్ నేరగాళ్ల మోసాలు ఇప్పుడు పట్టణాలు, గ్రామాలకు సైతం విస్తరించాయి.జనాలను నిలువుదోపిడీ చేసేస్తున్నాయి. నగరాలతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను పోలీస్ అరెస్ట్‌ల పేరుతో బెదిరిస్తే కాసులు రాలతాయనే ఆలోచనతో సైబర్ నేరగాళ్లు బరితెగించేస్తున్నారు. గతంలో సైబర్ నేరాలు కేవలం ఫోన్లలో ఫొటోల మార్ఫిడి, మహిళలకు ఫోన్లలో వేధింపులు, గిఫ్ట్‌ల పేరుతో ఫోన్లు చేసి డబ్బులు అడగడం, ఫోన్లకు లింకులు పంపి ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం చేసే ఘటనలు ఉండేవి. కానీ గడచిన రెండేళ్లగా సైబర్ నేర గాళ్లు రూటుమార్చి కోట్లలో డబ్బులు కొల్లగొట్టేస్తున్నారు. నెలకు పది సైబర్ నేరాలు నమోదైతే అందులో 8 కేసులు వీడియోకాల్స్ చేస్తూ ఫలానా నేరం మీపై నమోదైంది.అరెస్ట్ చేయడానికి వస్తున్నాం అనే బెదిరింపు ఫోన్‌కాల్స్‌తో డబ్బులు గుంజిన కేసులే.

మచ్చుకు కొన్ని కేసులు

ఈ ఏడాది అక్టోబరులో పెద్దాపురంలో ఓ భూస్వామికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపై ఈడీ, సీబీఐ కేసులున్నాయి. అరెస్ట్‌కు అనుమతి వచ్చింది అని బెదిరింపులు వీడియోకాల్స్ వచ్చాయి. అరెస్ట్ చేయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ నెలరోజుల వ్యవధిలో రూ.1.16కోట్లు గుంజేశారు.తాజాగా కాకినాడ జిల్లా కరప మండలంలో ఓ ప్రైవేటు ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి బెదిరించారు. పోలీసు డ్రెస్, వెనుక కటకటాలు కనిపించేలా చేసి అరెస్ట్‌కు వస్తున్నామంటూ రూ.25వేలు పిండేశారు. ఆ తర్వాత రోజే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో వైద్య విద్య చదువుతున్న ఓ విద్యార్థిని తండ్రికి ఫోన్ చేసి డబ్బులు గుంజడానికి ప్రయత్నించారు. తీరా సదరు వ్యక్తి ఎదురుతిరగడంతో తోకముడిచారు. 2022, సెప్టెంబర్‌లో అప్పటి కలెక్టర్ కృతికాశుక్లా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు పలువురు జిల్లా అధికారులకు మెసేజ్ చేశారు. కలెక్టర్ డీపీగా ఉన్న ఫోన్ నెంబర్‌కు అర్జెంట్‌గా డబ్బులు పంపాలని కోరారు. కొందరు అధికారులు నిజమేననుకుని డబ్బులు పంపారు. ఆ తర్వాత నేరుగా కలెక్టర్‌కు విషయం చెప్పగా అది సైబర్ నేరగాళ్ల పనిగా తేలింది. దీంతో కలెక్టర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు యూపీనెంబర్‌గా గుర్తించారు. నిందితులు కూడా అక్కడివారేనని తేల్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే ఆర్.మహేష్‌కుమార్ పేరుతో కూడా కొందరు అధికారులకు వాట్సాప్ సందేశాలను సైబర్ నేరగాళ్లు పంపించారు. ఈ ఏడాది సెప్టెంబరులో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ డీపీతో జిల్లాలో కొందరు తహశీల్దార్లకు సైబర్ నేరగాళ్లు అర్జెంట్‌గా తమ వారికి డబ్బులు పంపాలని కోరారు. ఆరా తీస్తే అది కూడా యూపీ నుంచి నేరగాళ్లు ఈ మోసానికి దిగినట్టు తేలింది. అదేనెల గండేపల్లిలో ఓ వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింకు ఓపెన్ చేయగా రూ.2.50లక్షలు బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్టు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు.

ఎన్నో రకాలుగా మోసాలు

వివిధ రకాల గేమ్ యాప్‌ల నుంచి సైతం డబ్బులు సైబర్ నేరగాళ్లు జనం నుంచి లాగేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో బ్యాంకుల పేరుతో ఫోన్‌లు చేసి ఓటీపీలు తెలుసుకుని లాగేసిన డబ్బు రూ.కోట్లలో ఉంటుంది. లింకులు పంపి అవి తెరవకపోతే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని బెదిరించి డబ్బులు ఖాళీ చేసేసిన కేసులు అనేకం. వ్యక్తిగత వివరాలతో లోన్‌యాప్స్ ద్వారా కాల్స్‌చేసి లింక్స్‌ను ఓపెన్ చేయమని కోరడం ద్వారా సదరు వ్యక్తికి సంబంధించిన బ్యాంకు అక్కౌంట్ నుంచి సొమ్ములు స్వాహా చేసే ఘటనలు ఉన్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ఫేక్ ఐడీలు సృష్టించి వాటిల్లోని కాంటాక్టు లిస్టుకు మెసేజ్‌లు పెట్టి అర్జెంటుగా డబ్బులు వేయాలని కోరుతున్న పరిస్థితులు ఉంటున్నాయి. ఇటీవల లవ్ స్కామ్స్ ఎక్కువయ్యాయి. బాధితులు వేలల్లో ఉంటున్నారు. కానీపోయిన డబ్బులు తిరిగి రావనే కారణంతో ఫిర్యాదు చేయడానికి చాలామంది ముందుకు రావడంలేదు. పెద్దాపురంలో మోసానికి గురైన రైతు ఫిర్యాదుతో పోలీసులు గుజరాత్‌కు వెళ్లి అక్కడ ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి తీసుకువచ్చి జైలుకు పంపారు.

మూడేళ్లుగా కేసులు ఇలా..



ఏడాది	కాకినాడ	తూర్పుగోదావరి	కోనసీమ
2022	54కేసులు	-	37 కేసులు
2023	38కేసులు	103 కేసులు	97 కేసులు
2024	50కేసులు	95 కేసులు	25 కేసులు

సైబర్ నేరాలు.. ఎన్ని రకాలంటే..

నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ మొత్తం 24 రకాలను సైబర్ మోసాలుగా విభజించింది. వీటిలో ఆర్థిక లావీదేవీలతో మాత్రమే సంబంధం ఉన్నవి 15.

- **విషింగ్:** ఫోన్‌కాల్ ద్వారా సైబర్ నేరస్తులు కస్టమర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వంటి వ్యక్తిగత సమాచారం సేకరించడం
- **ఆన్‌లైన్ జాబ్‌ఫ్రాడ్:** నిరుద్యోగులకు ఉద్యోగం పేరుతో నమ్మించి మోసం చేయడం
- **సెక్స్‌టింగ్:** ఫోన్ ద్వారా అసభ్యకర సందేశాలు, న్యూడ్ ఫొటోలు, పోర్న్ వీడియోలు పంపి డబ్బులు డిమాండ్ చేయడం.
- **స్మిషింగ్:** బాధితుడి ఫోన్‌కు తప్పుడు ఫోన్ నెంబర్ నుంచి సందేశం పంపి వారిని ఫోన్‌కాల్‌లోకి వచ్చేలా చేసి మాల్‌వేర్ డౌన్‌లోడ్ అయ్యేలా చేయడం
- **స్విమ్ స్వాప్ స్కామ్:** బాధితుడి ఫోన్ నెంబరుతోనే కొత్త సిమ్‌ను పొంది దాని ద్వారా ఓటీపీ సేకరించి మోసగించడం
- **డెబిట్/క్రెడిట్‌కార్డు:** డెబిట్ లేదా క్రెడిట్ కార్డు అనధికారికంగా ఉపయోగించడం.
- **ఇంపర్సేసన్ అండ్ ఐడెంటిఫికేషన్ టెస్ట్:** ఐడెంటిటీని దొంగిలించడం.. ఎలక్ట్రానిక్ సంతకం, పాస్‌వర్డ్ మోసపూరితంగా మార్చడం
- **ఫిషింగ్:** ఒక వ్యక్తి కస్టమర్ ఐడీ, పిన్, క్రెడిట్‌లేదా డెబిట్‌కార్డు నెంబరు, సీవీవీ నెంబరు మెయిల్స్ ద్వారా దొంగిలించడం
- **స్పామింగ్:** ఈమెయిల్, ఎస్ఎంఎస్,ఎంఎంఎస్‌ల ద్వారా వ్యాపార ప్రకటనల లింక్ పంపిస్తారు. డెబిట్/క్రెడిట్ కార్డుల వివరాలు కోరి డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చేస్తారు.
- **రాన్‌సమ్‌వేర్:** మీ మొబైల్, కంప్యూటర్‌కు ఒక మాల్‌వేర్‌ను పంపి మీ పరికరాన్ని హాక్ చేసి ఫైళ్లు, సమాచారం తస్కరించి వాటిని వెనక్కి ఇవ్వడానికి డబ్బులు డిమాండ్.
- **డాటా బ్రీచ్:** అనుమతి లేకుండా మన కంప్యూటర్‌లోని డేటా దొంగిలించడం.
- **వెబ్‌సైట్ డీఫేస్‌మెంట్:** ఒక వెబ్‌సైట్‌లోకి సైబర్ దొంగలు చొరబడి దాన్ని స్తంభింపజేస్తారు. వెబ్‌సైట్ డెవలపర్ ప్రమేయ లేకుండానే అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు, సందేశాలు వంటివి ప్రచురిస్తారు.
- **సైబర్ స్క్వాటింగ్:** ఒక అధికారిక వెబ్‌సైట్‌లోని డొమైన్ నేమ్‌ను పోలిన మరొక దానితో రిజిస్టరవుతారు.దీనిద్వారా తప్పుదోవ పట్టించి వెబ్‌సైట్‌కి నష్టం కలిగేలా చేస్తారు.
- **ఫార్మింగ్:** మనం ఒక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలనుకున్నప్పుడు దాన్ని పోలిన మరో బోగస్ వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్లడం.
- **క్రిప్టోజాకింగ్:** క్రిప్టోకరెన్సీల్లో పెట్టుబడులకు కంప్యూటింగ్ వనరులను అనధికారికంగా వినియోగించడం.



అసలు డిజిటల్ అరెస్టే లేదు



ఉమ్మడి జిల్లాలో మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు ఎక్కువగా యూపీ, బీహార్ నుంచే ఫోన్ కాల్స్‌చేస్తూ జనాలను భయపెట్టి డబ్బులు గుంజేస్తున్నారు. మీపై నమోదైన కేసుకు డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ భయ పెడుతున్నారు. వాస్తవానికి చట్టంలో ఎక్కడా డిజిటల్ అరెస్ట్ అనే ప్రస్తావనే లేదు. కాకపోతే పోలీసులమని చెప్తే ఎవరైనా భయపడతారనే కారణంతో ఆ పేరుతో మోసాలకు దిగుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఎవరైనా వీడియో కాల్స్ చేసి పోలీసు యూనిఫాంలో కనిపించి డిజిటల్ అరెస్ట్ అని భయపెట్టినా ఏమాత్రం భయపడకూడదని పోలీసులు చెబుతున్నారు. ఒకవేళ అలా ఫోన్ చేసి డబ్బులు బెదిరిస్తే ఏస్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నారు? తాము ఉండే స్థానిక పోలీస్‌స్టేషన్ పేరు చెప్పి అక్కడికి రండి అని గదమాయిస్తే సైబర్‌నేరగాళ్ల ఆట కట్టించవచ్చని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరాలను నియంత్రించాలనే ఉద్దేశంతో ప్రజల్లో పోలీసులు విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నారు.

సైబర్ నేరాలకో స్టేషన్..

రాష్ట్రంలో సైబర్ నేరాలు అంతకంతకూ పెరుగుతుండడంతో కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ కేసులను ఛేదించడం కష్టమవుతుండడం, దానికితగ్గ సాంకేతిక పరిజ్ఞానం చాలా మంది పోలీసు సిబ్బందిలో లేకపోవడం కూడా కేసుల్లో పురోగతి కనిపించడం లేదు. పైగా అసలు నేరగాడు ఎక్కడ ఉంటాడో కూడా కనిపెట్టలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో త్వరలో జిల్లాకు ప్రత్యేకంగా సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నేరానికి సంబంధించి దొంగలను పట్టుకోవడానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సిబ్బందికి అందివ్వబోతోంది. కొత్త జిల్లాల్లో సైబర్ పోలీసు స్టేషన్‌ను అన్ని రకాల పరిపుష్టి చేయనున్నారు.

ఇవే వారి పెట్టుబడులు

ఒక వ్యక్తి అవగాహన లేమి, భయం, తడబాటు, బలహీన వ్యక్తిత్వం, అత్యాశ.. వీటి కారణంగానే సైబర్ నేరగాళ్లకు మోసం చేయడం సులభతరమవుతోంది.

- **అవగాహన లేమి:** ఎవరైనా కొత్త నెంబర్ నుంచి ఫోన్ చేసి మీకు తెలిసిన విషయాలను మిమ్మల్ని నమ్మించేలా చెప్తారు.అనంతరం మీ వ్యక్తిగత సమాచారం లేదా ఓటీపీల్లాంటివి అడుగుతారు. ఇక్కడే మీరు జాగ్రత్తగా ఉండాలి. బ్యాంకు వాళ్లు ఓటీపీలు అడగరు.
- **తడబాటు :** కొందరికి తడబాటు ఎక్కువ. ఫోన్ వచ్చిన వెంటనే అటువైపు ఎవరు మాట్లాడుతున్నారో చూడరు. అడిగినవి చెప్పేస్తుంటారు. అదే సైబర్ నేరస్తుల పెట్టుబడి. అలా చేయకూడదు.
- **బలహీన వ్యక్తిత్వం:** కొందరికి బలహీన వ్యక్తిత్వం ఉంటుంది. తమతో ప్రేమగా మాట్లాడేవారు లేరని ఫీలవుతూ ఉంటారు. వీరికి ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి మాట్లాడి పరిచయం పెంచుకుని మోసం చేయొచ్చు. అందువల్ల బలహీన వ్యక్తితం ప్రమాదం.
- **అత్యాశ :** ఇది చాలా ప్రమాదకరం. మీకు గిఫ్ట్ వచ్చిందని, లాటరీ తగిలిందని ఫోన్‌కాల్ లేదా మెసేజ్ వస్తే వీళ్లు ఆగలేరు. ఆ సొమ్ము పొందాలని ఎంతకైనా తెగిస్తారు. అలా రూ.లక్షల్లో పోగొట్టుకుంటున్నారు.
- **భయం:** చాలామంది చిన్నచిన్న తప్పులు చేస్తుంటాం అనే భయం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే డిజిటల్ అరెస్టుల పేరుతో వీరు మోసపోతున్నారు.

ఏంటీ లవ్‌స్కామ్!



ఇటీవల యువతతోపాటు మధ్య వయస్కులు, గృహిణులను టార్గెట్ చేసి సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. ట్రాప్ చేసి డబ్బులు లాగేయడమే వారి లక్ష్యం.. 'లవ్‌స్కామ్' పేరు ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తోంది. ఒంటరి మహిళలు, పురుషులు ఈ కేసుల్లో చిక్కుకుంటున్నారు.

డేటింగ్ యాప్స్ : డేటింగ్ యాప్స్ ఈ మధ్య బాగా ప్రాచుర్యం పొందాయి. యువత వీటి మోజులో పడి కొత్తవారితో పరిచయం వైపు పరుగులు పెడుతున్నారు. ఇలా డేటింగ్ యాప్స్ ద్వారా పరిచయమైన అమ్మాయి మొదట్లో ఫోన్ సంభాషణలు జరుగుతాయి. కొన్నాళ్లు నచ్చినట్టు మాట్లాడతారు. ఏదొక అవసరం పేరు చెప్పి డబ్బులు లాగేస్తారు.

మ్యాట్రిమోనీ స్కామ్ : పెళ్లి కాని చాలా మంది యువతీ, యువకులు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌ల్లో తమ వివరాలు నమోదు చేస్తారు. సైబర్ నేరస్తులు వీరిపై కన్నేస్తున్నారు. వెబ్‌సైట్‌ల్లో వాళ్లు కూడా ఫేక్ ప్రొఫైల్ ద్వారా ఒకరిని పరిచయం చేసుకుని కొన్నాళ్లు ప్రేమగా మాట్లాడతారు. నమ్మించి రూ.లక్షల్లో లాగేస్తారు.

ప్యాకేజ్ స్కామ్ : విదేశాల నుంచి మీతో ఒక వ్యక్తి ప్రేమగా మాట్లాడుతున్నట్టుగా నటిస్తారు. మీకు రూ.కోట్ల విలువైన పార్శిల్ పంపినట్టు కస్టమర్ కేర్ నుంచి ఒక ఫోన్ కాల్ చేయిస్తాడు. దీనికి కస్టమ్స్ క్లియరెన్స్‌కు డబ్బులు కట్టాలని రూ.లక్షల్లో దోచేస్తున్నారు.

హెల్త్ స్కామ్: ఆస్పత్రులు, ఆలయాల వద్ద జరిగే స్కామ్ ఇది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి వ్యాధి త్వరగా నయం కాదు. కానీ కొందరు వీరిని గమనించి ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్తారు. ఆయన ట్రీట్‌మెంట్ పేరుతో పెద్ద మొత్తంలో లాగేస్తాడు.

వీడియో కాల్స్ : అపరిచిత వ్యక్తినుంచి ఒక మెసేజ్ వస్తుంది. దానికి మనం రిప్లై ఇస్తే వారి నుంచి సాంత్వన పొందేలా మెసేజ్‌లు వస్తుంటాయి. తర్వాత న్యూడ్ వీడియో కాల్ చేస్తారు. మీ శరీర బలహీనతను ఆసరాగా చేసుకుని మీరు కూడా న్యూడ్‌గా ఉండేలా చేస్తారు. మీ వీడియో రికార్డ్ చేస్తారు. డబ్బులు పంపకపోతే ఆ వీడియో వైరల్ చేస్తామని భయపెడ్తారు.

ఇవి పాటించండి..

- ఒక కొత్త నెంబరు నుంచి ఫోన్ కాల్ లేదా మెసేజ్ వస్తే రెస్పాండ్ కాకండి.
- మీ వ్యక్తిగత వివరాలు ఆధార్, పాన్, బ్యాంకు అకౌంట్, ఏటీఎం,ఏ సమాచారం వంటివి ఎవరికీ షేర్ చేయకండి.
- మీ మొబైల్‌లో కూడా సెక్యూరిటీ సెట్టింగ్స్ జాగ్రత్తగా చూసుకోండి. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు పర్మిషన్ ఇచ్చే ముందు జాగ్రత్త వహించండి.
- న్యూడ్ వీడియో కాల్స్ లేదా బెదిరింపు వీడియో కాల్స్ వచ్చినప్పుడు ఎదుటివారికి భయపడకుండా వారిని గట్టిగా ప్రతిఘటించండి.

సైబర్ క్రైమ్‌కు కాల్ 1930

ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీకి ఫోన్ చేయాలి. ఇందులో సైబర్ నేరానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలి. దీనిద్వారా స్థానిక పోలీసులు వెంటనే సైబర్ కేసు నమోదు చేస్తారు. మొదటగా ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్ జరగకుండా ఆపే ప్రయత్నం చేస్తారు. ఫోన్ కాల్స్‌లో బెదిరించి డబ్బులు గుంజుతున్న నేరగాళ్లపై పోలీసులు 318(4), బీఎన్ఎస్ 66 ఐటీఏ 2000-2008 చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఈ కేసు కింద నిందితులకు గరిష్ఠంగా ఏడేళ్లకుపైగా జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

ఏకాదశ రుద్రుల దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

బస్సుల్లో మూడు వేల మంది భక్తుల రాక


గంగలకుర్రు అగ్రహారంలో శివకేశవులను దర్శించుకుంటున్న భక్తులు

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొవ్వూరు, తాడేపల్లిగూడెం, రావులపాలెం, తణుకు తదితర డిపోల నుంచి 20బస్సుల్లో 2000మంది, ఇతర ప్రాంతాల నుంచి వెయ్యి మందికిపైగా ఏకాదశ రుద్రుల స్వామివార్ల దర్శనానికి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలోని గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మొసలపల్లి, కె.పెదపూడి, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, వక్కలంక, ముక్కామల, అమలాపురం మండలం పాలగుమ్మి, అయినవిల్లి మండలం నేదునూరు గ్రామాల్లోని వివిధ రూపాల్లో ఉన్న శివున్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఒకే రోజున ఏకాదశ రుద్రులను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పేర్కొన్నారు. భక్తులకు ఆయా గ్రామాల్లో ప్రసాదాలు, బాదంపాలు అందించారు.

మట్టి పార్థివ లింగాలకు లక్ష బిల్వార్చన

ఆరికరేవులలో ఆధ్యాత్మిక కార్యక్రమం


ఆరికరేవులలో మట్టి ఉమా పార్థివేశ్వర శివలింగాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బిక్కవోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఆరికరేవుల గ్రామంలోని శ్రీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా 54మట్టి పార్థివ లింగాలకు ఘనంగా లక్ష బిల్వార్చన, అభిషేకాలు జరిపారు. ముందుగా పార్థివ లింగాలను, విశ్వేశ్వర స్వామిలకు గ్రామోత్సవం జరిపారు. అనంతరం ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు లక్ష బిల్వార్చన, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చనలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తొండాపు సూర్యనారాయణరెడ్డి లత దంపతులు, సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, సభ్యులు ఇందల వీరబాబు, రెడ్డి శ్రీను, నాగదేవర సత్తిబాబు, కొర్ల భజనశ్రీను తదితరులు పాల్గొన్నారు. బిక్కవోలులో ప్రాచీన గోలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామికి లక్ష బిల్వార్చన, పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురు బుడతలమామిడి వద్ద త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం, ఊలపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.


బిక్కవోలులో లక్ష బిల్వాలతో గోలింగేశ్వరుడు

గుడిమెళ్లంక విచ్చేసిన భారతీ మహాస్వామి

శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


గుడిమెళ్లంకలో శివాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విధుశేఖరభారతి మహాస్వామి

మలికిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో శృంగేరీ పీఠాధిపతి విధుశేఖరభారతీమహాస్వామి శివాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, నాయకులకు ఆయన దర్శనభాగ్యం కల్పించారు. వారితో పాటు భక్తులు కూడా ఆయన్ను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వేద సభ నిర్వహించారు. నియోజకవర్గం నాలుగు మూలల నుంచి గుడిమెళ్లంక గ్రామంలో ఉన్న భారతీమహాస్వామిని చూసేందుకు తరలివచ్చారు. లక్కవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం, భోజన ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శంకరమఠం పీఠాధిపతి మంగళంపల్లి సాయిరామ్, శంకరమఠం సీఈవో మంగళంపల్లి కార్తీక్‌శర్మ శంకరమఠంలో ఇంతటి గొప్ప దైవ కార్యక్రమాలు జరగడానికి కారకులైన సుబ్రహ్మణ్యశర్మను పలువురు అభినందించారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట రామరెడ్డి

ప్రాథమిక స్థాయిలో అభ్యసన సామర్థ్యాలపై దృష్టి సారించాలి

దివాన్‌చెరువు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటరామరెడ్డి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ మూడో దశ శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏఎంవో రామరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆరు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. జిల్లాల వారీగా... కాకినాడ నుంచి 90 మంది, కోనసీమ నుంచి 90 మంది, తూర్పు గోదావరి నుంచి 70 మంది హాజరవుతున్నారన్నారు. కీ రిసోర్స్‌పర్సన్‌గా కె.మహేల వ్యవహరిస్తున్నారు.


ఉప్పాడ వద్ద ఎగసిపడుతున్న కెరటాలు

ఉప్పాడ తీరంలో ఎగసిపడుతున్న అలలు

కొత్తపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులు తీవ్రత ఎక్కువగా ఉండడంతో అలలు ఒడ్డుకు దూసుకొస్తున్నాయి. ఈదురుగాలులకు సముద్రం ఉప్పొంగుతోంది. కొత్తపట్నం నుంచి నేమాం సరిహద్దు వరకు బీచ్ రోడ్డుపైకి రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. ఆ మార్గంలో ప్రయాణించేందుకు ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రయాణికులను కొత్తపల్లి పోలీసులు అప్రమత్తం చేస్తున్నారు.


సత్యదేవుని దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రత్నగిరి... భక్తజనసిరి

» కార్తీక మాసం చివరి సోమవారం సత్యదేవుని దర్శనానికి పోటెత్తిన భక్తులు » ఒక్క రోజు రూ.కోటి ఆదాయం

అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారానికి తోడు దశమి పర్వదినం కావడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి భక్తులు పోటెత్తారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజామున ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్... సీసీ టీవీల ద్వారా క్యూలైన్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి పలు సూచనలిస్తూ, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటలు పట్టింది. సుమారు 90వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా 10,500 జంటలు వ్రతాలు ఆచరించారు. వివిధ విభాగాల ద్వారా సుమారు కోటి రూపాయల ఆదాయం సమకూరింది. అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం ముగ్గురు దాతలు విరాళాలు సమర్పించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరుకు చెందిన తేతల శ్రీనివాసరెడ్డి రూ.లక్ష, ఏలూరు జిల్లా మండవిల్లికి చెందిన మానుకొండ నాగేశ్వరరావు రూ.1,00,116 ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్‌కు అందజేశారు. దాతలను స్వామివారి ప్రత్యేకదర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన డి.వెంకటశ్రీను, వెంకట సూర్యనారాయణ సంయుక్తంగా రూ.1,00,116 అన్నదానం విభాగం సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్‌కు అందజేశారు.


సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న నాగేశ్వరరావు


సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న వెంకటశ్రీను, సూర్యనారాయణ


సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్‌కు విరాళం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

అన్నవరం దేవస్థానం ఈవోగా
త్రినాథరావు



అన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వేండ్ర త్రినాథరావును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈవోగా వున్న కె.రామచంద్రమోహన్ దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనరుగా పనిచేస్తుండడంతో పని భారం తగ్గించాలని ఎప్పటి నుంచో కోరుతున్నారు. అన్నవరం ఈవోగా గతంలో మూడేళ్లు పనిచేసిన అనుభవం త్రినాథరావుకు ఉండడంతో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయన్ను ప్రతిపాదించారు. ప్రస్తుతం సింహాచలం దేవస్థానం ఈవోగా కొనసాగుతున్న ఆయనకు అన్నవరం దేవస్థానం బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

అన్నవరం దేవస్థానం సీఆర్వో విభాగ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రసాద్‌ను బదిలీ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేశారు. సుబ్రహ్మణ్యానికి అన్నదానం బాధ్యతలు అప్పగించారు.


కోడిని చుట్టుముట్టిన కొండ చిలువ

చేబ్రోలులో కొండచిలువ
కలకలం

గొల్లప్రోలు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోనిరథంబాట సమీపంలో ఎర్రబంద చెరువు వద్ద కొండ చిలువ రెండు రోజులుగా కలకలం సృష్టిస్తోంది. సోమవారం చెరువు వద్ద కోడిని చుట్టుముట్టి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. దీంతో సమీపంలోని రైతులు అప్రమత్తమై ఆ ప్రాంత పరిసరాల్లో తిరుగుతున్న విద్యార్థినీ, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. కొండచిలువను పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు రేపు
స్క్రీనింగ్ పరీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని అభ్యర్థులకు బుధవారం స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకురాలు కేఎన్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డుతో ఉదయం పది గంటలకు బీసీ స్టడీ సర్కిల్ వద్దకు రావాలన్నారు.

లైంగిక వేధింపులతో వివాహిత ఆత్మహత్య

ద్రాక్షారామ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులతో మనస్థాపం చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటకు చెందిన వివాహిత గుత్తుల రమ్యశ్రీ (24)ను ఆమె ఇంటి సమీపంలో ఉన్న మేడిశెట్టి దుర్గాప్రసాద్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో మనస్థానం చెందిన రమ్యశ్రీ సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


డంప్‌లో ఉంచిన లోడింగ్ యంత్రాలు

లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం

» తరచూ డీజిల్ లేదనే సాకుతో నామమాత్రంగా ఇసుక విక్రయాలు » ప్రభుత్వ ఆదాయానికి గండి » పట్టించుకోని అధికారులు

ఎటపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని గుండాల డంప్-1లో లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ఇసుక అమ్మకాలు మందకొడిగా సాగుతున్నాయి. ఇటీవల లోడింగ్ ఏజెన్సీ ఇసుక విక్రయాలకు సహకరించట్లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నారు. యంత్రాల్లో డీజిల్ కొరత అంటూ తరచూ నామమాత్రంగానే లోడింగ్ చేస్తున్నారు. దాంతో ఇసుక కోసం వస్తున్న లబ్ధిదారులు గంటల కొద్దీ వేచి ఉండి లోడింగ్ చేసుకోకుండానే తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుండాల డంప్-1లో ఇసుక లోడింగ్ ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకున్న వారు ఇటీవల ఇదే తీరుని అనుసరిస్తున్నారు. దాంతో ఇసుక విక్రయాలు అనుకున్నంత స్థాయిలో జరగట్లేదు. సుదూర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఇసుక కోసం ఇక్కడకు వస్తే దొరకట్లేదు. దాంతో ఇసుక అవసరమున్న వారు బ్లాక్ మార్కెట్‌లో ట్రాక్టర్ లోడ్‌ని రూ.3వేల నుంచి రూ.3,500 వెచ్చించి కొనుగోలు చేసుకుంటున్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ అభాసుపాలవుతోంది. ఈ పథకం సక్రమంగా అమలు కావట్లేదన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు లోడింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతోంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోడింగ్ ఏజెన్సీని మార్చాలని స్థానికులతో పాటు టీడీపీ కార్యకర్తలు కోరుతున్నారు.

ఈ విషయమై తహసీల్దారు కారం సుబ్బారావును వివరణ కోరగా... లోడింగ్ ఏజెన్సీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని... వారిని పిలిచి మందలించినట్టు వివరించారు. మరోమారు ఇలా వ్యవహరిస్తే ఉన్నతాధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని చెప్పారు.


దీపాల సంబరంలో భాగంగా కార్తీక దీపం వెలిగిస్తున్న ఈవో సౌజన్య

కరపలో ఘనంగా దీపాల సంబరం

కరప, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో సోమవారం రాత్రి కార్తీక దీపాల సంబరం ఘనంగా జరిగింది. పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం కార్యనిర్వహణాధికారిణి సౌజన్య కార్తీక దామోదరునికి పూజలు చేసి దీపోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు తరలివచ్చి భక్తితో దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. టీడీపీ నేత కోటగిరి మహేంద్రబాబు స్వామివారిని దర్శించుకుని కోటి దీపోత్సవంలో పాల్గొన్నారు. కూరాడలో కూడా కార్తీక దీపాల సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ తోట సునీత, ఏఎస్ఐ సూరిబాబు, ఇతర సిబ్బంది అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.




మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివనాగబాబు

కుమారుడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా...

స్కూటీని ఢీకొన్న వ్యాన్... తండ్రి అక్కడికక్కడే మృతి

గండేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్కూటీని ఎదురుగా వచ్చిన వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామేశ్వరంపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన తాటిపాక గంగరాజు (28) తన భార్య, పిల్లలతో రంగంపేట గ్రామంలోని కోళ్ల ఫారంలో నివాసముంటున్నాడు. కుమారుడు అనిల్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో సోమవారం ఆనూరు హాస్పిటల్‌కు స్కూటీపై తీసుకుని వెళ్తుండగా రామేశ్వరంపేట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. గంగరాజు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు అనిల్ కాలుకి గాయమైంది. గంగరాజు భార్య సునీత ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు కేసు నమోదు చేశారు. ఆయన ప్రమాద స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.


క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ బూరా రామ్‌భైరవ, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఏకలవ్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయి పోటీలకు 15 మంది ఎంపిక

వై.రామవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరిలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వై.రామవరం మండలం పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-19లో బాక్సింగ్, బ్యాడ్మింటన్, షార్ట్‌పుట్, వెయిట్ లిఫ్టింగ్, చెస్, డిస్కత్రోల్లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ బూరా రామ్‌భైరవ తెలిపారు. 39 మంది విద్యార్థులు పాల్గొనగా 18 మంది పతకాలు గెల్చుకున్నారని చెప్పారు. వీరిలో 15 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులతో పాటు వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీలు ప్రశాంత్‌కృష్ణ, ప్రసాద్, సాగర్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.


పొలమూరులో యాత్రను ప్రారంభిస్తున్న అయ్యప్ప మాలధారులు

శబరిమలైకు సైకిల్‌పై....

ముగ్గురు అయ్యప్ప దీక్షాధారుల యాత్ర

అనపర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన ముగ్గురు స్వాములు శబరిమలైకు సైకిల్ యాత్ర చేపట్టారు. చిట్టూరి నాగమణికంఠ, వానపల్లి సూర్య జనార్దన్, మల్లెల వీరబాబు శబరిమలైకు సైకిల్‌పై వెళ్లాలని సంకల్పించారు. సోమవారం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి యాత్రను ప్రారంభించారు. పలువురు అయ్యప్ప దీక్షాధారులు సంఘీభావం తెలుపుతూ వారికి వీడ్కోలు పలికారు. సుమారు 1,400 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేసి స్వామి సన్నిధిలో ఇరుముడులు సమర్పించనున్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులను చూపిస్తున్న కిర్లంపూడి ఎస్ఐ

163 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్టు... 14 రోజులు రిమాండ్ విధించిన కోర్టు

కిర్లంపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామ జాతీయ రహదారిపై ఒక వాహనంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజమహేంద్రవరం వైపు వెళ్లే దారిలో మహేంద్ర గూడ్స్‌లో గంజాయి తరలిస్తుండడాన్ని కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, పోలీసు సిబ్బంది గుర్తించారు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా నాలుగు బస్తాల్లో 163 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ గంజాయిని ఏజెన్సీ నుంచి చెన్నై తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. తమిళనాడుకు చెందిన రంగస్వామి సత్యానందం, నవమని గురుస్వామిలను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ చెప్పారు.

ఆర్డీవోను కలిసిన కమిషనర్

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్డీవో కె.మాధవిని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవివర్మ ఆర్డీవో మాధవిని కలిసి పుష్పగుచ్ఛాలతో ఆమెకు అభినందనలు తెలిపారు.

సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడి ఎన్నిక

మలికిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెం, గొల్లపాలెం సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షునిగా రాపాక వెంకటనానాజీ, ఉపాధ్యక్షుడిగా గిడ్ల విజయ్‌కుమార్‌ను సోమవారం ఎన్నుకుని ఘనంగా సన్మానించి సత్కరించారు. సొసైటీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పలువురు కోరారు.బత్తుల బాలసంజీవరావు, గంటా ఆశీర్వాదం పాల్గొన్నారు.

వాయుగుండం.. రైతుల పాలిట గండం..



ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతు

మామిడికుదురు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో వాయుగుండం తమకు గండంలా మారేలా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సార్వా పంట చేతికి అందే సమయంలో వాయుగుండం ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోసిన చేలను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుని రాశులుగా చేసుకుంటున్నారు. మండలంలో 2420 ఎకరాల్లో సార్వా పంట పండించారని, ఇప్పటివరకు 230ఎకరాల్లో రైతులు పంటను ఒబ్బిడి చేసుకున్నారని, 30ఎకరాల్లో వరి పనలపై ఉందని, ఇప్పటివరకు 370క్వింటాళ్ల ధాన్యం మిల్లులకు తరలించినట్టుగా వ్యవసాయాధికారి పి.మృదుల తెలిపారు. వాయుగుండ ప్రభావంతో గాలులు, వర్షాలు వస్తే పంట నేలను అంటి అపార నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

యానానికి 5 ఎకరాల భూమి కేటాయించండి

యానాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల అవసరాలకు (డపింగ్ యార్డు) జిల్లాలోని 5ఎకరాల భూమిని యానానికి కేటాయించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మల్లాడి కాకినాడ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబును కలిసి యానాం విషయాల గురించి వివరించారు. యానానికి ఐదు ఎకరాల భూమిని ఎవరికి ఇబ్బందిలేని ప్రాంతంలో గ్రామాలకు దూరంగా ఇవ్వడానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. దరియాలతిప్ప ఆయకట్టు, అడవిపాలెం తీరప్రాంతాలకు తాగు, సాగునీటి అవసరాల కోసం ఏపీ ప్రభుత్వంలో



కలెక్టర్‌కు వినతిప్రతం అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, ఆర్‌ఏ మునిస్వామి

గతంలో కుదుర్చుకున్న ఒప్పంద ప్రకారం నీటిని సరఫరా చేయాలని మల్లాడి కోరారు. ఎస్సీ సొసైటీ రైతులకు కేటాయించిన పందులంక భూమి గురించి కోర్టు ఇచ్చిన ఆదేశాల గురించి కలెక్టర్‌తో చర్చించారు.

మహిళలకు హక్కులపై అవగాహన అవసరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళలకు హక్కుల పట్ల అవగాహన ఎంతైనా అవసరమని డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జండర్ హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారాన్ని ఈనెల25నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఐక్యరాజ్య సమితి ప్రతీ ఏటా నవంబరు 27న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింస వ్యతిరేక దినంగా పాటించాలని తీర్మానించిందన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించడంతో పాటు భ్రూణ హత్యలు నిరోధించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావు, మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ ఎం.ఝాన్సీరాణి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకాదశ రుద్రుల క్షేత్రానికి ఆదరణ

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోనసీమలోని ప్రసిద్ధి చెందిన ఏకాదశ రుద్రుల శైవక్షేత్రాలకు భక్తుల నుంచి ప్రతిఏటా విశేషమైన స్పందన లభిస్తోందని, కొవ్వూరు డిపోతో పాటు ఇతర డిపోల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేస్తున్నారని ఆర్టీసీ ఏడీసీ పెండ్యాల సూర్యచంద్రరావు అన్నారు. గంగలకుర్రు అగ్రహారం శివకేశవుల ఆలయ ప్రాంగణంలో సూర్యచంద్రరావును శివకేశవయూత్, గ్రామప్రజల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏకాదశ రుద్రుల యాత్రకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల నుంచి విశేషమైన స్పందన వచ్చిందన్నారు. ప్రతి ఏటా ఈక్షేత్రాలను బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్



జి.అగ్రహారంలో ఆర్టీసీ అధికారిని సత్కరిస్తున్న శివకేశవయూత్, గ్రామస్థులు

దొంగ నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ బందన రాంబాబు, శ్రీపాద వెంకటరమణ, తాతా చిట్టిబాబు, మట్టపర్తి చంద్రశేఖర్, మట్టపర్తి సూర్యప్రకాష్, శింగంశెట్టి తాతాజీ, పుల్లారావు, గ్రంధి బాలాజీ, బాసా చిన్న, పెద్దిరెడ్డి సతీష్, ఇసుకపూడి వాసు, నందెపు శ్రీను పాల్గొన్నారు.

హరహర మహాదేవ

అయినవిల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. అయినవిల్లిలో శ్రీసిద్ధివినాయక ఆలయం, అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, ముక్తేశ్వరంలో గల ముక్తికాంత క్షణ ముక్తేశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. అయినవిల్లిలో రహదారులు వాహనాలు, భక్తుల రద్దీతో కిక్కిరిశాయి. వాహనాలకు పార్కింగ్ అవకాశం లేక వీధుల్లోనే వాహనాలను పార్కింగ్ చేయడంతో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆలయ క్యూలైన్లు, మండపాలు భక్తులతో నిండిపోయాయి. అధిక సంఖ్యలో భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు సేవలు అందించారు.







అయినవిల్లి దేవస్థానంలో భక్తుల రద్దీ, ముమ్మిడివరంలోని ఉమాసూరేశ్వరస్వామి నిజరూపం, ఐ.పోలవరం: వీరేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

లక్ష బిల్వార్చన పూజలు

మామిడికుదురు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని మొగలికుదురులోని చౌడేశ్వరి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, పాశర్లపూడిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజలను వేదమంత్రోచ్చారణలతో ఘనంగా జరిపారు. రామలింగేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, మహాలింగార్చన, పంచామృతాలతో అభిషేకాలతో పాటు అమ్మవార్లకు లక్ష కుంకుమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లోను శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆయా గ్రామాల్లో గల శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

రాజోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) కార్తీక మాసం ఆఖరి సోమవారం మండలంలో ఉన్న శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఓం నమఃశ్శివాయ.. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. కడలి, శివకోటి, తాటిపాక, పొన్నమండ, వేగివారిపాలెం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అర్చకులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పలు ఆలయాల్లో సాయంత్రం దీపాలంకరణ నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆఖరి సోమవారం శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే భక్తులు నదీ స్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. శైవ క్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. ముమ్మిడివరంలోని శ్రీఉమాసోమేశ్వరస్వామి, కొత్తలంకలోని పార్వతీ బ్రహ్మేశ్వరస్వామి, శ్రీశ్యామలాంబ సమేత భోగమల్లేశ్వరస్వామి, క్రాపచింతలపూడిలోని ఉమావల్లభేశ్వరస్వామి ఆలయాలు, అయినాపురం, కొమానపల్లి, ఠాణేలంక, సీహెచ్. గున్నేపల్లి, అనాతవరం, అన్నంపల్లి గ్రామాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు జరిపించారు.

పంచామృతాలతో అభిషేకాలు

పి.గన్నవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెల్లంపూడి శ్రీబాలాత్రిపురసుందరి సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయం, పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయం, మొండెపులంక శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే స్వామివారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కారుపల్లి, వై.కొత్తపల్లి, ఉడిమూడి, మానేపల్లి, నరేంద్రపురం, కుందాలపల్లి, ముంగండ, కుందాపల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తుల విశేష పూజలు

ఉప్పలగుప్తం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం మండలంలోని అన్ని శివాలయాల్లో భక్తులు అధికసంఖ్యలో పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజల కోసం క్యూకట్టారు. గొల్లవిల్లి శ్రీమాణిక్యాంబ సహిత భీమేశ్వరాలయంలో అధికసంఖ్యలో భక్తులు గోత్ర నామాలతో అభిషేక పూజలు చేయించుకున్నారు. ఉప్పలగుప్తం, మునిపల్లి, విలసవిల్లి, ఎన్.కొత్తపల్లి, ఎస్.యానాం, సన్నవిల్లి, భీమనపల్లి, కూనవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, లక్ష బిల్వార్చనలు జరిగాయి.

ఆలయాలకు కార్తీక శోభ

అంతర్వేది, నవంబరు25(ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడు పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీకసోమవారం పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాలతో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. తొలుత సముద్ర, నదీ పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అంతర్వేది పుణ్యక్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు. గుడిమూల కృతకుత్య రామలింగేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వరస్వామి, సఖినేటిపల్లి శివాలయం, అంతర్వేది కొత్తవంతెన వద్ద శివాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

యానాంలో ఆలయాలు కిటకిట

యానాం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సోమవారం యానాంలోని అన్ని ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక గౌతమి గోదావరి పుష్కరఘాట్‌కు భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి గోదావరిలో వదిలారు. దీంతో రాజీవ్‌గాంధీ బీచ్ శివంబాత్ భక్తులతో కిటకిటలాడింది. బ్రాహ్మణులకు దీపదానం చేసి కార్తీక పూజలు చేశారు. అభయ ఆంజేయస్వామికి, రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలుచేశారు. దీంతో ఫెర్రీ రోడ్డు కార్తీక శోభతో కళకళలాడింది. స్థానిక శివాలయంలో ఉన్న రాజరాజేశ్వరస్వామికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు.

వేకువజాము నుంచి అభిషేకాలు

అల్లవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అల్లవరం మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. అల్లవరం ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో కోడూరుపాడు క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళంపల్లి పాండురంగ విఠల్ బ్రహ్మత్వంలో లక్ష బిల్వార్చన పూజలు జరిగాయి. కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు, నడింపల్లి సత్యనారాయణరాజు, నడింపల్లి సంజయ్‌వర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. రామేశ్వరంలో చెక్కా రాంబాబు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించినట్లు ఛైర్మన్ అంగాని రామారావు తెలిపారు. రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, దేవగుప్తం, గోడి, గోడిలంక, బోడసకుర్రు, బెండమూర్లంక, కొమరగిరిపట్నం తదితర శివాలయాల్లో వేకువజాము నుంచి అభిషేకాలు జరిగాయి.

వీరేశ్వరునికి పాలాభిషేకం

ఐ.పోలవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి సోమవారం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. వీరేశ్వరునికి పాలాభిషేక పూజలు చేయించారు. మురమళ్ళకు చెందిన నలమాటి అవినాష్‌చౌదరి, జితేష్‌చౌదరి ఆధ్వర్యంలో భక్తులకు భోజనవసతి ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యూనియన్ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవం

అంతర్వేది, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అభివృద్ధికి బ్యాంకింగ్ సేవలు ఎంతో ఉపయోగకరమని రాజమహేంద్రవరం రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు అన్నారు. కేశవదాసుపాలెం కాల్వమొగ సెంటర్‌లో యూనియన్ బ్యాంకు నూతన భవన ప్రారంభోత్సవాన్ని అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలిసి ఆయన నిర్వహించారు. బ్రాంచి మేనేజర్ యు.రవిబాబు, వివిధ బ్రాంచిల మేనేజర్లు, రీజనల్ ఉన్నతాధికారులు, భవన యజమాని యెనుముల కూనారావు, అసిస్టెంట్ మేనేజర్ దుర్గారావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, బ్యాంకు సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీల్లో కాంస్య పతకం



కాంస్య పతకం అందుకుంటున్న క్రీడాకారులు

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల24,25తేదీల్లో అండర్-14 రాష్ట్రస్థాయి సపక్‌తక్రా చాంపియన్ షిప్ పోటీలు ఎన్టీఆర్ జిల్లా పటమటలో జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఈపోటీల్లో అద్భుత ప్రతిభ చాటింది. రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించినట్టు కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. గుంటూరు, నెల్లూరు, అనంతపురం జిల్లా జట్లపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌లో కర్నూలు జట్టుపై గెలిచి కాంస్య పతకం సాధించినట్టు కోచ్ తెలిపారు. కాంస్య పతకం సాధించిన క్రీడాకారులతో పాటు అందుకు కృషి చేసిన కోచ్ బూల చిరంజీవి, మేనేజర్ కేతా సతీష్‌లను సపక్‌తక్రా అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాది తాతబాబు, కేతా సాయిదుర్గాప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

కరాటే పోటీల్లో రీజెన్సీ విద్యార్థిని ప్రతిభ

యానాం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో నిర్వహించిన 24వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్‌లో యానాం రీజెన్సీ విద్యార్థిని నాగాభట్ల వెంకట పద్మజ వెండి పతకాన్ని కైవసం చేసుకుంది

రహదారి మధ్యలో అక్రమంగా వేసిన ఇనుప స్తంభాలు తొలగించాలి

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బండారులంక పంచాయతీ పరిధిలోని కందులపాడు కాలనీ ప్రధాన రోడ్డు మార్గంలో పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో కొందరు అక్రమంగా ఇనుప స్తంభాలు పాతడం వల్ల ఎనిమిది నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు సోమవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకెళ్లారు. బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, మంజుల, పద్మ, శోభ, వెంకటలక్ష్మి, రాణి, సూర్యలక్ష్మి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలి

అమలాపురంటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లు, వాచ్‌మెన్లకు బకాయి పడ్డ ఆరునెలల వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నెలకు రూ.6వేలువేతనంతో ఆ కుటుంబాలు ఎలా బతకాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ ప్రశ్నించారు. ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ సౌకర్యాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. సీఐటీయూజిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి, ఉపాధ్యక్షుడు ఎం.భాస్కరరావు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ పాల్గొన్నారు.

దళితులపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి

అమలాపురంటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండపేటలో దళితులను అక్రమంగా నిర్బంధించి దాడి చేసిన కేసులో మిగిలిన నిందితులను తక్షణం అరెస్టుచేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు రాష్ట్రనాయకుడు వెంటపల్లి జాన్‌మార్క్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేసును పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయలేదన్నారు. నిందితులకు మంజూరైన బెయిల్‌ను రద్దుచేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్‌చేశారు.దండంగి చినబాబు, పి.రాజు, చుట్టుగుళ్ల వీరవెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అమలు చేయకుంటే నిరసనలు

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హెచ్చరించారు. ఇసుక తవ్వకాలకు మత్స్యకార సొసైటీలకు అవకాశం కల్పించాలన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపడతామన్నారు. కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణి, నాయకులు ముషిణి రామకృష్ణారావు, ఎం.శివన్నారాయణ, వంటెద్దు బాబి, కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జూలై 2021 నుంచి బకాయి పడ్డ ఐదు నెలల 14రోజుల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట మెడికల్ అండ్ హెల్త్ ఫార్మాసిస్ట్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా శిబిరం నిర్వహించారు. 15 నెలలుగా బకాయిపడ్డ పీఎఫ్ సొమ్ములను చెల్లించాలన్నారు. యూనియన్ నాయకులు ఎస్వీవీ సత్యనారాయణ, వై.నటరాజు ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

విద్యార్థుల భవితను తీర్చిదిద్దేందుకు సమావేశాలు

అంతర్వేది, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు ఏవిధంగా చదువుతున్నదీ తెలియచేయాలనే కార్యక్రమాన్ని డిసెంబరు 7న రాష్ట్ర వ్యాప్తంగా మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంఈవో-1 డి.కిశోర్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల భవితను తీర్చిదిద్దేందుకు అన్ని పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించాలని మీడియా సమక్షంలో అన్నిపాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు తెలిపారు.. విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్, ఎంపీటీసీలు, పాఠశాలయాజమాన్య కమిటీ ఛైర్మన్లు హాజరు కావాలన్నారు.మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు ముందస్తుసమావేశాలు నిర్వహించాలన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రాజోలు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సోంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి ఆపరేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. మామిడికుదురుకు చెందిన అంజు కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ తేజ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పదహారు మందిని ఆపరేషన్‌కు ఎంపికచేసి, 29మందికి రాయితీపై కళ్లజోళ్లు అందజేశారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, అంజు ఆసుపత్రి మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

అల్లవరం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): పశువులు, కోళ్లకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.వెంకట్రావు అన్నారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు ఉన్న పెయ్యి దూడలకు గోడితిప్పలో వ్యాధి నిరోధక టీకాలు వేశారు. బోడసకుర్రు, యెంట్రుకోనలో కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేయించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ మేడిద నారాయణరావు సహాయకులు శివ, వెంకటేష్, హేమలత, బి.శివ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు .

సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

అల్లవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో అన్ని సచివాలయాల ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో బీవీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం జరిగింది. ప్రభుత్వ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం బ్యాంకు ఖాతాలు, ఎన్‌పీసీఐ, హౌస్‌హోల్డ్ సర్వేలు 30వ తేదీలోపు పూర్తిచేయాలన్నారు. రవిరాజు, సుభాషిణి, దిలీప్, చైతన్య పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేయండి

ఉప్పలగుప్తం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా రాబోయే అయిదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రస్తుతానికి సార్వా వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు రైతులకు సూచించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం మొలకెత్తకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

సేవలందించిన అధికారులకు సత్కారం

అమలాపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం తాలూకా సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాలు వైభవంగా ముగిసేందుకు సహకరించిన పోలీసు అధికారులను ఆలయ కమిటీ తరపున సత్కరించారు. కార్తీక సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలో విశేష పూజాభిషేకాలు నిర్వహించారు. అఖండ అన్నసమారాధన జరిపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, కొండా చంటి, బిళ్ల వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణ నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో జనుపల్లి సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా నల్లమిల్లి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా నల్లమిల్లి పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా పెనుగాడి నాగబాబు, కార్యదర్శిగా కోట వెంకటదుర్గారావు, కోశాధికారిగా అయినవిల్లి గంగాధర్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను పట్టణ కమిటీ ప్రతినిధులు పసుపులేటి శ్రీనివాసరావు, ర్యాలి లోవరాజు, కె.గోవిందులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నగర పంచాయతీ ఉద్యోగులు, నాయకులు

ముమ్మిడివరం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన తర్వాత తొలిసారిగా ముమ్మిడివరం విచ్చేసిన ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ పిన్నమరాజు రవివర్మ, మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, టీడీపీ నాయకులు విళ్ల వీరాస్వామినాయుడు, పిల్లి నాగరాజు, ఏఈ సుధాకర్, మేనేజర్ పీవీ నూకరాజు, జె.సత్యనారాయణరాజు, భాస్కర్, రామకృష్ణ, రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, నగర పంచాయతీ సిబ్బంది ఎమ్మెల్యేను సత్కరించి స్వాగతం పలికారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కోశాధికారి ఎస్.పృథ్విరాజ్ పేర్కొన్నారు. ముమ్మిడివరం డాక్టర్ మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బుద్ధిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులకు రాజ్యాంగంపై పరీక్ష నిర్వహించారు. 40మంది పరీక్షకు హాజరయ్యారు. విజేతలైన ముగ్గురికి రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా షీల్డులు బహూకరిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కట్టా శ్రీనివాసరావు, అధ్యాపకులు ఉండ్రు కిరణ్‌కుమార్, కె.దుర్గాప్రసాద్, భానుప్రసాద్, కె.చంద్రరరావు, లైబ్రేరియన్ డి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే రజకుల అభ్యున్నతి సాధ్యం

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రజకుల అభ్యున్నతి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని తాలూకా రజక సంక్షేమ భవనంలో ముమ్మిడివరపు రాంబాబు అధ్యక్షతన సోమవారం రజకసంఘ సమావేశం జరిగింది. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరారు. మలికిపురంమండలంలో రజకులపై జరిగిన దాడిని సమావేశం తీవ్రంగా ఖండించింది. గొల్లపల్లి ధర్మారావు, సామంతకుర్తి సుబ్బారావు, కె.నాగేశ్వరరావు, సామంతకుర్తి సూర్యనారాయణ, కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, కె.మణికంఠ, ఎస్.వెంకన్నబాబు, కోటిపల్లి మోహనరావు, ఎస్.పేరయ్య, కేశనకుర్తి సుబ్బారావు, పి.బాలకృష్ణ, ఎస్.రామకృష్ణపాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

అయినవిల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): కొండుకుదురులోఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నాయకులు ఇంటి నిర్మాణాలకు అనుమతులు పొంది ఇసుక విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇసుక వాహనాలను సీజ్‌చేసినా యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. సోమవారం ఇసుక తరలిస్తున్న వారిపై వీఆర్వో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీడీపీ కార్యకర్తకు నామన ఫౌండేషన్ చేయూత

పి.గన్నవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురం శివారు బూరుగుగుంటకు చెందిన టీడీపీ కార్యకర్త జిత్తుగ శ్రీనివాసరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు నామన ఫౌండేషన్ ద్వారా ప్రస్తుత ఖర్చుల కోసం శ్రీనివాసరావు కుటుంబానికి రూ.10వేలు సమకూర్చారు. టీడీపీ మండల నాయకులు సోమవారం భార్య వరలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర వెంగమాంబ, సంసాని పెద్దిరాజు, కేదాశి చిన్న, శేరు శ్రీనుబాబు, గుత్తుల రామకృష్ణ, కొక్కిరి లక్ష్మి, పెదపూడి రాము, విత్తనాల ఆదినారాయణ, దొమ్మేటి వెంకటేశ్వరావు, గోగి నాగరాజు పాల్గొన్నారు.

ఆలయంలో ఆర్జేసీ పూజలు

అంతర్వేది, నవంబరు25(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి దేవదాయ ధర్మాదాయ శాఖ రాజమహేంద్రవరం రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులచే మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి వారికి అందించారు. తనిఖీ అధికారి రామలింగేశ్వరరావుపాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పాడైపోయిన టవర్లను మార్చడంతో పాటు మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల26 నుంచి 28 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రెడ్డి వెంకటశ్రీధర్, ఎం.రవికుమార్ తెలిపారు. 132 కేవీ రామచంద్రపురం నుంచి అమలాపురం, కొత్తపేట లైన్‌లో పాడైపోయిన టవర్లకు మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా 220కేవీ ఉండి విద్యుత్ ఉపకేంద్రం నుంచి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అయినప్పటికీ 30 మెగావాట్ల విద్యుత్ లోటు ఏర్పడవచ్చునన్నారు. ఆ మూడు రోజులు పారిశ్రామిక, ఆక్వా రైతులకు ఉదయం 9నుంచి సాయంత్రం 7గంటల మధ్యలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తాటాకిల్లు దగ్ధం: రూ.5లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఠాణేలంకలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక తాటాకిల్లు దగ్ధమై సుమారు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం ఏర్పడింది. ఠాణేలంక దేవీ సెంటర్ కాలనీలో కొప్పిశెట్టి భూలక్ష్మికి చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైంది. మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ అంటుకుని పేలిపోయింది. బీరువాలో ఉంచిన రూ.1.50లక్షలు, ఆరుకాసుల బంగారు వస్తువులు మంటల్లో దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు మంటలనుఅదుపుచేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సకాలంలో మంటలు అదుపుచేయడంతో చుట్టుపక్కల ఇళ్లకు ప్రమాదం తప్పింది.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

అమలాపురంటౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి, ఉప్పలగుప్తం మండలాల్లో మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని తహశీల్దార్ కోర్టుల్లో బైండోవర్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పీటీవీ సత్యనారాయణ సోమవారం తెలిపారు. చల్లపల్లిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న పోలిశెట్టి సురేష్‌ను ఎస్ఐ పి.బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్టుచేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశామన్నారు. అయినవిల్లి మండలంలో గుత్తుల సుధాకరరావు, ఇసుకపట్ల వసంతరావు, నక్కా సత్యనారాయణలను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశామన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న భక్తులు

వాడపల్లి ఆలయంలో భక్తుల సందడి

వెంకన్న ఒకరోజు ఆదాయం రూ.4.31లక్షలు

ఆత్రేయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోము ఆచరిస్తున్న భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.4,31,449 వచ్చిందని ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



ఎన్‌సీపీఐ ఖాతాలు తీసుకునేందుకు వచ్చిన గ్రామస్తులతో పోస్టల్‌శాఖ సిబ్బంది

ఎన్‌సీపీఐ ఖాతాలతో బహుళ ప్రయోజనాలు

మండపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీపీఐ ఖాతాలు తెరవడంలో రాజమహేంద్రవరం పోస్టల్‌శాఖ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని ఆశాఖ సూపరింటెండెంట్ కె.శేషగిరిరావు తెలిపారు. మండపేటలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీపీఐ ప్రత్యేక శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కేవలం రూ.200కే పోస్టల్‌శాఖ ద్వారా ఖాతాను తెరిచి ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందవచ్చన్నారు. ఎన్‌సీపీఐ లింకడ్ ఖాతాలు తెరవటం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. పోస్టల్ అసిస్టెంట్ కెవీ నారాయణరావు, కె.సూర్యనారాయణ, ఎండీ మౌలానా కృషిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు జి.శివయ్య, జి.వెంకట్రావు, ఎస్.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

రాయవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశయులైన కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన యాళ్ల సత్యనారాయణ, యాళ్ల సుందరరావు ఇళ్లల్లో 18న జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులు సర్వం కోల్పోగా ఎమ్మెల్యే వారిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ: మండలంలోని చెల్లూరు గ్రామంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే వేగుళ్ల పరామర్శించారు. గ్రామానికి చెందిన ఇనపకోళ్ల వెంకట్రావు, కాకులపాటి పుల్లయ్య, ఇనంపల్లి నరసమ్మ, బొడ్డు సత్యవతి మరణించగా వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు.

ఎమ్మెల్యేకు సత్కారం: రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఎమ్మెల్యేను చెల్లూరు గ్రామానికి చెందిన పలువురు నేతలు సత్కరించారు. చెల్లూరులో పర్యటించిన ఆయన్ను సత్కరించారు. మాజీ సర్పంచ్‌లు నూనె ఏసుబాబు, మోరంపూడి రాజ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు తదితరులు ఉన్నారు.

సకల శాస్త్రాలకు వేదమే మూలం



కపిలేశ్వరపురంలో వెంకటలక్ష్మీనరసింహాచార్యులు రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సకల శాస్త్రాలకు వేదమే మూలమని వేద పండితుడు వాడపల్లి గోపాలాచార్యులు అన్నారు. కపిలేశ్వరంలో వున్న జనార్దనస్వామి ఆలయంలో వైఖానస పండితుడు పెద్దింటి వెంకట లక్ష్మీనర సింహాచార్యులు రచించిన వైఖానస ఆగమ కల్యాణ ప్రకరణ గ్రంథం పూర్వ విధమైన రచనను ఆయన పుస్తక రూపంలోకి తీసుకురాగా దాన్ని వైఖానస పండితులు ఆవిష్కరించారు. పుస్తక రచయిత పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు మాట్లాడుతూ తాను నేర్చుకున్న వేదవిద్యను భవిష్యత్ తరాలకు అందించాలన్న ఆలోచనతో ఈ పుస్తకాన్ని రచించానన్నారు. వైఖానస పండితులు మాట్లాడుతూ ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాజమహేంద్రవరానికి చెందిన పారిశ్రామికవేత్త దాట్ల బుచ్చి వెంకటపతిరాజు కుటుంబ సభ్యులు పుస్తక అవిష్కరణలో పాల్గొన్నారు. పుస్తక రచయితను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైఖానస సంఘ అధ్యక్షుడు ఖండవల్లి కిరణ్ కుమారాచార్యులు, జిల్లాలోని పలు దేవాలయాలకు చెందిన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నిమ్మ, బత్తాయి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి కోటేశ్వరరావు

కొత్తపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై బత్తాయి, నిమ్మ రైతులు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట డివిజన్ ఉద్యానశాఖాధికారి డాక్టర్ జి.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని నారాయణలంకలో నిమ్మ, బత్తాయి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల నిమ్మ, బత్తాయిలో పూత రావడం ఆలస్యమైందని రైతులు కంగారుపడాల్సిన పనిలేదన్నారు. పూత రావడానికి వచ్చినా అది నిలబడటానికి, తెగుళ్ళ నివారణకు వాడాల్సిన మందులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు జి.శ్యామల, రైతులు చోడపనీడి సత్యనారాయణ, పైడికొండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దర్శనానికి పయనం

రాయవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాయవరంలో అయ్యప్ప మాలదారుల ఇరుముడులు సోమవారం జరిపారు. తొలుత స్థానిక అయ్యప్పపీఠం వద్ద గురుస్వాములు పిల్లి రాంబాబు, పులగం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలుత వినాయకుడు, సుబ్రహ్మణ్యశ్వరస్వామి, అయ్యప్పస్వామి, పార్వతి పరమేశ్వరులకు పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలదారుల ఇరుముడులు కట్టుకుని శబరిమల అయ్యప్పస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు.



శబరిమల వెళ్లేందుకు ఇరుముడులు కడుతున్న అయ్యప్పస్వాములు

మండల పరిషత్ సమావేశం వాయిదా

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ అంబటి భవానీ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి సమీక్షలు జరపకుండా వాయిదా వేస్తున్నట్టు ఎంపీపీ తెలిపారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులు గమనించాలన్నారు.



ఆత్రేయపురం మండలం ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి ఆలయంలో బారులుతీరిన భక్తులు



రాయవరం సోమేశ్వరంలోనున్న సోమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న దృశ్యం



పలివెల ఉమాకొప్పేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



కోటిపల్లి శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శివాయ..నీలకంఠాయ

• కిటకిటలాడిన శైవక్షేత్రాలు • ప్రత్యేక పూజలు, అభిషేకాలు • బారులుతీరిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో ఆలమూరు విక్రమభట్టీశ్వర స్వామివారు

కె.గంగవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శంకర అంటూ... భక్తుల శివ నామస్మరణతో కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. కార్తీకమాసం ఆఖరు సోమవారం కావడంతో భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలో లక్షపత్రి పూజ జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ ఈవో భీమశంకరం తగిన ఏర్పాట్లు చేశారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో: అష్టసోమేశ్వర ఆలయాల దర్శన యాత్రను పురస్కరించుకుని ఆర్టీసీ బస్సుల్లో వచ్చిన యాత్రీకులతో యండగండి సోమేశ్వరస్వామి ఆలయం కిటకిటలాడింది. పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ, దంగేరు, బాలాంత్రం, మసకపల్లి, భట్లపాలిక తదితర గ్రామాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఆత్రేయపురం: కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. వేకువజామునే మహిళలు నదుల్లో స్నానాలు చేసి కార్తీకదీపాలు వదిలారు. ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి, వాడపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు బారులుతీరారు. శివుడికి అభిషేకాలు, పూజలు చేశారు. ఆయా ఆలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం జరిపారు. కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో రమా వీరవెంకట సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపారు. వందలాది మంది భక్తులు ఈ వ్రతంలో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల మహిళలు, భక్తులు వేకువజామునే గౌతమినదిలో స్నానాలు చేసి ఆలయాల్లో సందడి చేశారు. ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు తదితర పలు ప్రత్యేక కార్యక్రమాలు జరిపారు. కపిలేశ్వరపురం పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో పలువురు అర్చకులు భక్తుల నుంచి స్వయంపాకం అందుకున్నారు.

ఆలమూరు: కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. ఆలమూరు విక్రమభట్టీశ్వరస్వామి, మూలస్థానం మూలేశ్వరస్వామి, చొప్పెల్ల మల్లేశ్వరస్వామి, జొన్నాడ రామలింగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, మడికి సోమేశ్వరస్వామి, పెనికేరు ఇష్టకాంతేశ్వరస్వామి, చింతలూరు పృథ్వీశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, నవాబుపేట, కలవచర్ల గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆయా ఆలయాల్లో మహిళలు కార్తీక దీపారాధనలు చేశారు.

నీలకంఠేశ్వరస్వామికి అన్నాభిషేకం

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం ఏరుపల్లిలోనున్న రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామికి సోమవారం అన్నాభిషేకం చేశారు. ముందుగా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం అన్నాభిషేకం జరిపారు. ఆయనతోపాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ స్వామివారికి అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సాక్షి శివ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మండపేట: పట్టణంతోపాటు మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆయా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. రథం గుడి సెంటరులో వున్న అగస్త్యేశ్వరస్వామి, ఏడిద సంపమేశ్వరస్వామి, ద్వారపూడిలో వున్న అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో వున్న శివాలయంతోపాటు, గ్రామంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. కేశవరం, పాలతోడు, వెలగతోడు, మారేడుబాక ఇప్పనపాడు తదితర గ్రామాల్లోని ఆయా శివాలయాలు కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆయా ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఉమాకొప్పేశ్వరస్వామి ఆలయంలో..

కొత్తపేట: కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని పలివెల ఉమాకొప్పిలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శివలింగానికి నారికేళ పంచామృతాలతో అర్చకులు పూజలు జరిపారు. సాయంత్రం కార్తీక దీపారాధన జరిగింది.

రాయవరం: మండలంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామ స్మరణలతో మార్మోగాయి. మండలంలోని అష్టసోమేశ్వర ఆలయాల్లో ఒకటిగా పేరొందిన సోమేశ్వరం బాలాత్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వర స్వామి ఆలయాలు కిటకిటలాడాయి. సోమేశ్వరంలో పురోహితులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో సోమేశ్వరస్వామికి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేస్తారు. వెంటూరులో రుద్రాభిషేకాలు, అర్చనలు జరిపారు. రాయవరం పార్వతి సమేత రాజరాజేశ్వరస్వామి ఆలయంలో విలపర్తి ఫణిధర్ ఆధ్వర్యంలో, రాయవరం అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, చెల్లూరు అగస్త్యేశ్వరస్వామి, లొల్ల ఉమా రామలింగేశ్వరస్వామి, విసావరం మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు.

ఘనంగా లక్ష బిల్వార్చన: మండలంలోని సోమేశ్వరం సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన జరిపారు. అర్చకుడు పరిటాల సోమశేఖర శర్మ అర్చకత్వంలో వినాయకపూజ, పుణ్యాహవచనం, సోమేశ్వరస్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, సూర్య నమస్కారాలు, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన, జ్యోతిర్లింగార్చన చేశారు.



ద్రాక్షరామలో నీలకంఠేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న మంత్రి సుభాష్



భూమిపూజ చేస్తున్న మంత్రి సుభాష్

ఆలయ నిర్మాణానికి మంత్రి సుభాష్ భూమిపూజ

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్లలో నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వట్టికూటి ఏసుబాబు, పాముల వీరభద్రరావు, సురేష్, పలువురు అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములు ఇరుముడి సమర్పణ అనంతరం నిబద్ధత, ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని మంత్రి సుభాష్ అన్నారు. సోమవారం శివాలయంలో అయ్యప్పస్వాముల 41 రోజుల దీక్ష అనంతరం ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్పకు ఇరుముడి సమర్పించిన అనంతరం కూడా వారు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు.

నాటుసారా అమ్మకందారుల అరెస్టు

ఆలమూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో నాటుసారా అమ్మకాలు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం...ఆలమూరు, మండపేట మండలాల్లో దాడులు జరపగా ఆలమూరు మండలం మడికిలో మార్గాని దుర్గారావు, బడుగువానిలంకలో మారిశెట్టి లక్ష్మణరావు, మండపేట మండలం కేశవరంలో కడగల రాముడులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 35 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.



వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన అజీజ్‌ను కలిసిన మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్

వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను కలిసిన షరీఫ్

కొత్తపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నియమితులైన షేక్ అబ్దుల్ అజీజ్‌ను సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మీరాన్ షరీఫ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



చాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విజేత కోనసీమ జిల్లా

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విజేతగా అంబేద్కర్ కోనసీమ జిల్లా 420 పాయింట్లతో విజేతగా నిలిచినట్టు నిర్వాహకుడు బి.కెంపు రత్నం తెలిపారు. ఆర్‌సీఎంలో జరిగిన 24వ రాష్ట్రస్థాయి పోటీలకు పలు జిల్లాల నుంచి బాలబాలికలు పాల్గొన్నట్టు తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 12 వరకు పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. విశాఖ జిల్లా 200 పాయింట్లతో రెండో స్థానం, 150 పాయింట్లతో కాకినాడ, 115 పాయింట్లతో తూర్పుగోదావరి జిల్లా తరువాత స్థానాల్లో నిలిచినట్టు తెలిపారు. బాలుర బ్లాక్‌బెల్ట్ సీనియర్ విభాగంలో పి.గణేష్ ప్రథమస్థానం, బి.రవితేజ ద్వితీయ స్థానం, బాలికల్లో బ్లాక్‌బెల్ట్ కె.లేఖ నిహారిక ప్రథమస్థానం, ఎస్.కె.రిణా ద్వితీయస్థానం పొందినట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా లయన్ జీవీ రావు, నల్లమిల్లి జనార్ధనరెడ్డి, జి.ఆనందబాలు, చైతన్య రైసుమిల్లు బాబులు రెడ్డి హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలు అందించారు.



మండపేటలో జరిగిన కార్తీక వన సమారాధనలో పాల్గొన్న వాకర్స్

కార్తీక వనసమారాధనలో సందడి

మండపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని బూరుగుంట చెరువు వైఎస్ఆర్ పార్కులో సోమవారం డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధ జరిపారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సీహెచ్ భాస్కరరాజు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధనను వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు రెడ్డి రాధాకృష్ణ ప్రారంభించారు. ముందుగా డొక్కా సీతమ్మ వాకర్స్ క్లబ్ సభ్యులు పార్కులో వున్న విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కార్తీక వన సమారాధన ప్రారంభించారు. పార్కులో వున్న సమస్యలను పరిష్కరించాలని క్లబ్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో వాకర్స్ వేగుళ్ల రామ్మోహన్ కుమార్, పోలిమాటి అనందబాబు, షేక్ అబ్బాస్, గనిశెట్టి శ్రీనివాస్, తాతపూడి సుధీర్, డాక్టర్ గంపల సత్యన్నారాయణ, డాక్టర్ హైదర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధనలో విజేతలకు బహుమతుల పంపిణీ

రాయవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో బసవేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వన సమారాధన జరిపారు. దేవాంగుల ఫంక్షన్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో ఉసిరి చెట్టు వద్ద పార్వతి పరమేశ్వరులు, లక్ష్మీనారాయణులకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు ఆటపాటలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం కార్తీక వనసమారాధన జరిపారు. కార్యక్రమంలో బసవేశ్వర దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు , గ్రామస్థులు పాల్గొన్నారు.



పసలపూడి వనసమారాధనలో చిన్నారుల సందడి



పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

భీమేశ్వరాలయంలో ఎస్పీ పూజలు

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సతీసమేతంగా దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. జిల్లా అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థుల ఇండ్రస్ట్రియల్ విజిట్

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఆదివారపుపేట అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సోమవారం ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలను సందర్శించారు. 8, 9, 10, ఇంటర్ విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సుల్లో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వీఎస్ం ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కెరీర్ గైడెన్స్ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సత్యనారాయణ, ట్రైనర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే బండారు పూజలు

రావులపాలెం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో ఉన్న ఉప్పలపాటి జానకీమ్మ అన్నదాన సత్రం వద్ద కార్తీక వనసమరాధన దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అక్కడ నిర్వహించిన పూజల్లో పాల్గొని వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సత్రం ఆధ్వర్యంలో సమకూర్చిన నగదు బహుమతులు, పుస్తకాలను విద్యార్థులకు అందచేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

శివాలయంలో భక్తుల సందడి

రావులపాలెం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాల్లో పలు ప్రత్యేక పూజలు జరిగాయి. రావులపాలెం మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఆర్డీవోను కలిసిన కమిషనర్

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్డీవో కె.మాధవిని ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సోమవారం కలిశారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవివర్మ ఆర్డీవో మాధవిని కలిసి పుష్పగుచ్ఛాలతో ఆమెకు అభినందనలు తెలిపారు.